చిన్నకథ :

# ముగ్గురు వీరులు

శ్రీ ప్రఖ్యా ఆంజనేయశాస్త్రి

పూర్వము వుజ్జయినీ అను పట్టణమును పుణ్యసేనమహారాజు ఏలుచుండెను. ఆ మహారాజుదగ్గర ప్రియ మంత్రి హరిస్వామి అను బ్రాహ్మణు డుండెను. ఆయనకు దేవస్వామి అను పుత్రుడు సోమప్రభ అను పుత్రిక కలరు. ఆ కన్య మిగుల సౌందర్యముతో తులతూగుచుండెను. ఒకనాడు ఆమె తండ్రిగారితో "నాన్నగారూ" నన్ను శూరునికిగాని, విజ్ఞానికిగాని, జ్ఞానికిగాని యివ్వవలసినదేగాని మరి అన్యులెవ్వరికి యీగూడదుసుమా! అని చెప్పెను. అది మొదలుకొని తండ్రి వరునికోసమై వెదకుచుండెను. యింతలో ఆ రాజు రాష్ట్రముపై దండెత్తివచ్చి దక్షిణదేశపు రాజు వద్దకు హరిస్వామి అను బ్రాహ్మణుని రాయభారము పంపెను. అదే సమయ మనుకొని సోమప్రభ యొక్క వివాహమునకు ప్రయత్నించగా ఒక బ్రాహ్మణకుమారుడు వచ్చి తన కిమ్మని హరిస్వామిని అడుగగా "నాకూతురు శూర, జ్ఞాని, విజ్ఞానులలో నొక్కరిని వరియించునుగాని అన్యులెవ్వరిని వివాహముచేసుకొనదు" అని చెప్పెను. అయినను నీ వెవ్వడవు అని హరిస్వామి అడుగగా నేను విజ్ఞాని ని వాడు పలికెను. అంతట హరిస్వామి అతనిని విజ్ఞానము ప్రదర్శింపు మనెను. అంతట ఆ కుమారుడు మాయచే ఒక పూలవిమానమును సృష్టించి అందులో హరిస్వామిని కూర్చొనబెట్టుకొని స్వర్గాదిలోకములు చూపించెను. అంతట మంత్రి సంతోషించి తన కుమార్తెను అతనికిచ్చిఏడవ దినమున వివాహముచేయుటకు నిశ్చయించెను. అంతట ఆవుజ్జయినీనగరములోనే యింకొక విప్రకుమారుడు వచ్చి దేవస్వామిని (అనగాహరిస్వామికుమారుడు) "నీ చెల్లెలను నా కియ్యవలసినదని అడుగగా నాచెల్లెలు పైచెప్పిన ముగ్గురిలోమాత్రమే వరించునుగాని అన్యులెవ్వరిని వరింపదు" అనెను. కాని నీ వెవ్వడవు అని దేవస్వామి అడుగగా తాను శూరుడనని చెప్పకొని తన శస్త్రాస్త్రవిద్యాప్రభావమును కనబరచెను. అంతట దేవస్వామి పెద్దల నడిగి ఏడవదినమునముహూర్తమునిశ్చయించి వివాహమునకు వాగ్దానము చేసెను. ఆ సమయమందే తల్లిని యింకొక విప్ర కుమారుడు వచ్చి కూతురును నాకియ్యవలసినదని అడుగగా ఆమె "నాకూతురుశూర, జ్ఞాని, విజ్ఞానులలోమాత్రమే వివాహమును చేసుకొనునుకాని యితరులెవ్వరిని వివాహము చేసుకొనదు. అని నీ వెవ్వడవుఅని అడగ "తాను జ్ఞాని" అని వర్తమాన భూతభవిష్యత్తులను చెప్పగా యితనికి ఏడవనాడు వివాహముచేయుటకు నిశ్చయించి వాగ్దానము ఆనాడు రావలసినదని చెప్పగా వారు వెళ్లిపోయిరి. తర్వాత హరిస్వామి తిర్గి యింటికి రాగా తక్కిన యిద్దరి సంగతులు చెప్పగా ఎట్లాయనుకొనుచుండిరి. యిట్లుండగా వివాహదినము వచ్చెను. ఆరోజు జ్ఞాని, విజ్ఞాని, శూరులు హరిస్వామియింటికి వచ్చిరి. ఆ సమయమున ఒక వింత జరిగెను. సోమప్రభ ఎటకు పోయెనో, ఏమైనదో ఎంత వెదికినను కానరాదయ్యె. అంతట హరిస్వామి దిగులొంది జ్ఞానిదగ్గరకు వచ్చి "ఓజ్ఞానీ! నాకొమరిత ఎచ్చట వున్నదో చెప్పుము" అని అడుగ "ధూమశిఖుడను రక్కసుడు కొనిపోయి వింధ్యారణ్యములో తన యింట నుంచుకొన్నాడు. అని చెప్పగా, అప్పుడు హరిస్వామి 'వివాహ మెట్లు జరుగును! అయ్యో! నా కూతురు ఎక్కడ' అని మొఱపెట్టసాగెను. అంతట విజ్ఞాని "అయ్యా! భయపడవలదు. మీకొమరిత ఎచ్చట నున్నదని జ్ఞానిపలికినాడో అచ్చటకు మిమ్మెల్లరను చేర్చెదను. అని చెప్పి ఒక రథమును నిర్మించి అందు వారినెల్ల నెక్కించుకొని వింధ్యారణ్యములో గల ధూమశిఖుని యింటి బయట నిల్పెను. వారి రాక ఎఱింగి కోపముతో బయటకు ధూమశిఖుడు రాగానే ఎల్లరు భయపడగా, మీ కేమి భయము లేదని శూరుడు వారించి అతనితో పోరారంభించి వాని తలను అర్థచంద్రబాణమున ద్రుంచెను. వెంటనే ఎల్లరు లోపల నున్న సోమప్రభను తీసుకొని హరిస్వామి యింటికి తిరిగివచ్చిరి. అందరు యింటికిరాగా అచట లగ్నవేళ కాగా జ్ఞాని, విజ్ఞాని, శూరులు మువ్వురును జగడమాడ జొచ్చిరి.

జ్ఞాని:—"నేను ఎఱుంగకుంటినా, ఎచ్చటనో దాచబడియున్నఈ కన్య మీ కెట్లు దొరుకును? కాన నీ కన్య నా కియ్యవలసినది"

విజ్ఞా:—"నేను త్వరగా వెళ్లు అరదమును చేయకున్నచో మీకు రాకపోకలలో ఎట్లు సహాయపడును? కాన నాకు యీ కన్యను యివ్వవలయును"

శూరుడు:—"నేను ఈ రాక్షసుని చంపకున్న మీరిద్దరు ఎంత ప్రయత్నించినను ఏమి ప్రయోజనము? కన్యను యిచ్చటకు ఎవడు తెచ్చును? కావున నాకు ఈ కన్యను యివ్వవలసినది"

వారు యిట్లు జగడమాడుచుండగా హరిస్వామికి యేమియు తోచక ఊరకుండెను. కావున మీరు యీ ముువ్వరిలో ఎవ్వరికి యిచ్చి వివాహము చేయవలెనో సక్రమముగా నిర్ణయింపుడు.

---

బాలానందం :

# గౌతముడు దొంగ

శ్రీ యస్. వి. హనుమంతరావు

పూర్వ మొక రాజ్యములో ఒక దొంగ వుండేవాడు. వాడు ప్రజల యిండ్లలో చొరబడి వస్తువులను దొంగిలించుకొనిపోవుచు, తన్నడ్డగించిన వారిని చావగొట్టుచుండెను. రాజుగారు కూడ వాని నేమియు చేయజాలకుండిరి.

ఒకనాడు బుద్ధదేవుడు ఆ రాజ్యమునకు వచ్చెను. రాజు ఆయనతో— "స్వామీ! మా రాజ్యమున నొక దొంగ కలడు. వాడు చాల దుర్మార్గుడై ప్రజలను పీడించుచున్నాడు. తమరే వానిని సన్మార్గమునకు త్రిప్ప సమర్థులు" అని విన్నవించెను.

బుద్ధుడు కొంచెమునే పాలోచించి "నా శక్తికొలది నేను ప్రయత్నింతు" నని చెప్పి, దొంగను వెదుకుటకు బయలుదేరెను.

బుద్ధుడు కాలినడకనే దొంగయిల్లు చేరెను. దొంగయిల్లొక యరణ్యమున నుండెను. బుద్ధుడు దొంగను పిలువగానే అతడు వచ్చి, ఈయనను చూచి యాశ్చర్యపడెను. దొంగ బుద్ధుని ప్రశ్నించెను—"అయ్యా! నీ వెవరు? ఇచ్చటి కెందులకు వచ్చితివి? ఇచ్చటికి వచ్చుటకు గొప్ప సాహసులుకూడ వెనుదీయుదురే! అలాంటప్పుడు నీ వెందుకు వచ్చినావు? ఏమి, నీ ప్రాణములమీద నీ కాశ లేదా?"

గౌతమబుద్ధుడు ఇట్లు జవాబు చెప్పెను:—"నాయనా! భగవంతుడు నాకీ శరీరమును యితరులకు సేవచేయుటకొరకే యిచ్చియున్నాడు. కాని యితరులను హింసించుటకు గాదు. ఈ శరీరముతో నీ కేమియైన పని యున్నచో అవశ్యము తీసికో!"

గౌతముని జవాబు విని దొంగ పశ్చాత్తాపడెను. అప్పటినుండి యాతడు గౌతముని శిష్యుడాయెను.

రాజుగారీ సంగతి విని గౌతమబుద్ధుని ఆత్మశక్తిని వేనోళ్ళ కొనియాడిరి. ప్రజలు "జేజే"లు పెట్టిరి.

(హిందీనుండి అనువదింపబడ్డది)

---

## తోడుదొంగలు

(11-వ పేజీ తరువాయి)

"అండర్ గ్రవుండ్‌లో వున్నానురా బ్రదర్

"సంతోషించాం కాని మేం ఏమ: కున్నామో నీ కిప్పుడెల్లా తెలిసింది ? ; వ్వక్కడ లేవుగా ?"

"లేకపోతేనేం ? మన భీము డున్నాడు ఇక్కడ! అన్నాడు రామదాసు.

"అయితే ఇద్దరూ కలిసి ఆడిన నాట మన్నమాట! తోడుదొంగలు ?" అన్నా పుల్లయ్య.

"అవును. నేను అసలు మొదటినుంచీ అ మనే అనుకుంటున్నాను. నే నసలు నమ్మనేలే అన్నాడు మల్లయ్య.

"అవునుపాపం. అందుకే కాబోలు, వి హం చేయిస్తానని కూడా ఒప్పుకు న్నా వ్ అంటూ రామదాసు చల్లగా లేచి కా కు(రాళ్ళ లాడ్జికి బయలుదేరాడు.



ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్‌వారు విల్టన్‌లో ఏర్పాటుచేసిన కొత్త రసాయనిక యంత్రాగారము. దీని నిర్మాణానికి 29.3 కోట్ల రూపాయలు ఖర్చయింది.